# సాక్షి
## జనగామ

శనివారం । 25 । మార్చి । 2023






**పట్టు పరిశ్రమకు అనుకూలం**

పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, రైతులు దృష్టి పెట్టాలని సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు.

- 8లో▸



**'గజ్జల' గ్రంథాలయం..**

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను సేకరించి గ్రంథాలయంగా తీర్చిదిద్దారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/24^0$

**వాతావరణం**

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి సమయంలో చలి మామూలుగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### ఆర్టీసీ కార్గో ద్వారా రాములోరి తలంబ్రాలు



రఘునాథపల్లి: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు బుకింగ్ చేసుకున్న భక్తులకు ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా ఇంటికే పంపించనున్నట్లు జనగామ డిపో మేనేజర్ వి.జ్యోత్స్న అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆమె ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి రాములవారి తలంబ్రాల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాములోరి తలంబ్రాలు పొందాలనుకునే భక్తులు 99948 164847 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం సర్పంచ్ శివకుమార్ తలంబ్రాలు బుక్ చేసుకున్నారు. మేకల నరేందర్, కుర్ర సురేందర్‌గౌడ్, కోళ్ల రవిగౌడ్, అల్లిబిల్లి నర్సయ్య, ఎండీ.షబ్బీర్, అరూరి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### పిల్లల ఎదుగుదలను గమనించాలి

బచ్చన్నపేట: పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉన్నారా లేదా.. అని తల్లిదండ్రులు వారి ఎదుగుదలను గమనించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆలింపూర్ పీహెచ్‌సీని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. అవసరమైన మందులను కూడా ప్రభుత్వం ఆయా హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచిందన్నారు. సర్పంచ్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్‌గా అరవింద్‌రెడ్డి



జనగామ: బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్‌గా 7వ వార్డు కౌన్సిలర్ మల్లవరపు అరవింద్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. అరవింద్‌రెడ్డిని ఫ్లోర్ లీడర్‌గా సూచిస్తూ మెజార్టీ కౌన్సిలర్ల తీర్మానం మేరకు.. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే (అధిష్టానం)కు లేఖ పంపించారని, ఆయన ఆదేశాల మేరకు అరవింద్‌రెడ్డి ఫ్లోర్‌లీడర్‌గా కొనసాగుతారని సురేష్‌రెడ్డి పేర్కొన్నారు.

### లక్ష్యాలను పూర్తి చేయాలి

- వీసీలో సీఎస్ శాంతికుమారి

జనగామ: తెలంగాణ సర్కారు ఆశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలకు చేరిన కంటి అద్దాలు లబ్ధిదారుల ఇంటికి చేరేలా చూడాలన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఏప్రిల్ మొదటి వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాల రవాణా, వాటి స్టోరేజీ, పరీక్ష కేంద్రాల్లో వసతుల కల్పన తదితరాలను కలెక్టర్లు పర్యవేక్షించాలని చెప్పారు. వీసీలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీఓ రాంరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ రజిత, డీఐఈఓ శ్రీనివాస్, డీఈఓ కె.రాము, హౌసింగ్ ఈఈ దామోదర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

రఘునాథపల్లి: రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో దుర్బర జీవనం గడుపుతున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొడిదేటి కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేకల నరేందర్, గాదె రమేష్, జేరిపోతుల సుధాకర్, సాయిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కడారి ఐలయ్య, నర్సింగరావు, రంగు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వశక్తి'కి సోలార్ చేయూత

- స్వయం సహాయక సంఘాల సభ్యులకు సోలార్ యూనిట్లు
- జిల్లాకు 115 మంజూరు
- స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



దేవరుప్పులలో సభ్యురాలి ఇంటిపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

జనగామ రూరల్: ఇంధన పొదుపు.. పర్యావరణ పరిరక్షణ.. విద్యుత్ బిల్లుల ఆదా.. సరఫరాలో అంతరాయాలు, ఇతర సమస్యలకు చెక్ పెడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. స్వశక్తి సంఘాల సభ్యులు ఎవరి ఇంటిపై వారు తమకు అవసరమైన సామర్థ్యం మేరకు సోలార్ విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మహిళా సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**టీఎస్ రెడ్కో సంస్థతో ఒప్పందం**

స్వశక్తి సంఘాల సభ్యులకు సోలార్ యూనిట్లు అందించేందుకు ప్రభుత్వం ఇటీవల టీఎస్ రెడ్కో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. గృహావసరాలకు ప్రతి నెలా 200 నుంచి 300 యూనిట్ల విద్యుత్ ఉపయోగించే సభ్యులకు సౌర శక్తితో నడిచే యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాకు 115 యూనిట్లు మంజూరయ్యాయి. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలంటే.. లబ్ధిదారులు ఆర్‌సీసీ బిల్డింగ్ కలిగి ఉండి.. నెలకు రూ.160 నుంచి రూ.225 వరకు విద్యుత్ బిల్లు వస్తూ ఉండాలి.

**స్త్రీ నిధి ద్వారా రుణాలు**

సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై మహిళా సంఘాల సభ్యులకు డీఆర్‌డీఏ సిబ్బంది గ్రామాల వారీగా అవగాహన సదస్సుల ద్వారా వివరిస్తున్నారు. దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో మొదటగా ఈ కార్యక్రమాలు చేపట్టారు. నెలకు 150 నుంచి 250 యూనిట్ల విద్యుత్ వినియోగించే మధ్య తరగతి కుటుంబాలకు 2 కిలోవాట్ల సోలార్ యూనిట్ సరిపోతుంది. దీని ద్వారా రోజుకు 8 యూనిట్ల సౌర విదుత్ ఉత్పత్తి అవుతుంది. పెద్ద కుటుంబాలకు 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్యానల్ ఏర్పాటు చేస్తే రోజుకు 12 యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతుంది. సభ్యురాలికి స్త్రీ నిధి ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. దీనిని ప్రతి నెలా చెల్లించే అవకాశం ఉంది.

**సౌర విద్యుత్ పథకం వివరాలు(రూ.ల్లో)**

| యూనిట్ కెపాసిటి | 2 కిలోవాట్లు | 3 కిలోవాట్లు |
|---|---|---|
| ప్రాజెక్ట్ విలువ | 1,42,200 | 1,92,360 |
| సబ్సిడీ | 39,200 | 57,360 |
| దరఖాస్తు రుసుం | 2,360 | 3,450 |
| నెట్ మీటర్ చార్జీలు | 2,950 | 2,950 |
| స్త్రీ నిధి రుణం | 1,00,000 | 1,25,000 |
| సభ్యురాలి వాటా | 3,000 | 10,000 |
| నెల వారీ వాయిదా | 2,248 | 2,803 |

**ఇవీ ప్రయోజనాలు**

సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. విద్యుత్ వినియోగ బిల్లులో తగ్గుదల ఉంటుంది. నిర్వహణ ఖర్చు ఉండదు. ఉత్పత్తి అయిన సోలార్ కరెంటులో వాడుకోగా మిగిలిన కరెంటును గ్రిడ్‌కు సరఫరా చేసి అవసరానికి వాడుకోవచ్చు. దీంతో యూనిట్‌కు పెట్టే పెట్టుబడి ఐదేళ్లలో తీరిపోతుంది. వారంటీ కూడా 25 సంవత్సరాలు ఉంటుంది. యూనిట్ వారంటీ మాత్రం ఐదేళ్లుగా నిర్ణయించారు.

**పథకం అమలు ఇలా..**

సౌర విద్యుత్ యూనిట్ పూర్తి స్థాయిలో అమర్చిన తర్వాత రెడ్కో అధికారులు, స్త్రీ నిధి సిబ్బంది తనిఖీ చేసి సభ్యురాలి సంతృప్తి మేరకు ఇన్‌స్టాలేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. తరువాత రుణం మొత్తం స్త్రీ నిధి నుంచి సభ్యురాలి సేవింగ్ ఖాతాలో జమ అవుతుంది. అనంతరం నికర మొత్తాన్ని వెండర్‌కు చెల్లిస్తుంది.

**లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం**



జిల్లా వ్యాప్తంగా గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు క్షేత్ర స్థాయిలో మహిళా సంఘాల సభ్యులకు పూర్తి స్థాయిలో పథకం గురించి వివరించి లక్ష్యం పూర్తి చేస్తాం.

- రాంరెడ్డి, డీఆర్‌డీఓ

**సద్వినియోగం చేసుకోవాలి**



సోలార్ యూనిట్లు మహిళా సంఘాల సభ్యులకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటి ఏర్పాటుపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఎంపికైన వారికి సౌరశక్తి యూనిట్లు అందిస్తున్నాం. సబ్సిడీపై స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నాం. అవకాశాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

- పాలాడి నిర్మల, స్త్రీ నిధి ఆర్‌ఎం

## సాక్షి 15వ వార్షికోత్సవం



సాక్షి దినపత్రిక పురుడు పోసుకుని 15ఏళ్లు పూర్తయిన సందర్భంగా వరంగల్ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, రిపోర్లర్లు, సిబ్బంది కలిసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సాక్షిలో తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

### దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం

జఫర్‌గఢ్: కేంద్ర సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. తమ్మడపల్లి(జి)లో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో పేదలు మరింత పేదలుగా.. సంపన్నులు కుబేరులుగా మారుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని చెప్పారు. అనంతరం వివిధ పార్టీల నుంచి పలువురు సీపీఎంలో చేరగా.. వారికి రాజు కండువా కప్పి ఆహ్వానించారు. చందునాయక్, ఎండీ షబానా, రాపర్తి సోమయ్య, సుధాకర్, గుండెబోయిన రాజు, చిన్నరాములు పాల్గొన్నారు.

### నేడు అవార్డుల ప్రదానం

జనగామ: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా స్థాయి పంచాయతీ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ డీపీఓ వసంత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ శివలింగయ్య హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## ఎంసీహెచ్‌లో 'లక్ష్య, ముస్కాన్' బృందాలు



ఆస్పత్రి ఆవరణలో లక్ష్య, ముస్కాన్ బృందాలు

జనగామ: జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రాన్ని(ఎంసీహెచ్/ఆస్పత్రి) లక్ష్య, ముస్కాన్ బృందాలు శుక్రవారం సందర్శించాయి. నేషనల్ క్వాలిటీ బృందం సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, వైశాలి ఆస్పత్రిలోని లేబర్ రూం, మెటర్నిటీ, చైల్డ్ కేర్ న్యూబార్న్ కేర్, పిడియాట్రిక్ సేవలు, గైనిక్ థియేటర్, మిల్క్ బ్యాంకు, ఎస్ఎన్‌సీయూ, ఓటీ, డీఈఐసీ విభాగాలను పరిశీలించారు. ఈ బృందాలు ఇచ్చే నివేదికల ఆధారంగా ఆస్పత్రికి నేషనల్ క్వాలిటీస్ సర్టిఫికెట్ అవార్డు వచ్చే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, డాక్టర్లు శంకర్, స్వప్న, స్వప్న రాథోడ్, సంధ్య, కనకరాజు, రూప, ప్రవంతి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

### ఇంటిగ్రేటెడ్ వసతులతో మహిళా భవనం



భూమిపూజ చేస్తున్న ఎన్ఆర్ఐ నర్సింహారెడ్డి

దేవరుప్పుల: సమాజ అభివృద్ధికి మహిళల తోడ్పాటు కీలకంగా మారిన తరుణంలో తన భార్య సమత స్మారకార్థం ఇంటిగ్రేటెడ్ వసతులతో మహిళా సంఘం భవనం నిర్మిస్తున్నట్లు పెద్దమడూరుకు చెందిన ఎన్ఆర్ఐ ఆకవరం నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్య అభ్యసించి విదేశాల్లో స్థిరపడేందుకు దోహదపడిన జన్మభూమి, సహచరిణి సమత రుణం తీర్చుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ ఎ.సృజనాపెద్దారెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ గిరి, నల్ల ఉమేష్, రాములు, ఎం.శ్రీనివాసాశర్మ, ఊర్మిళ, యాదమ్మ, రచన, చంద్రకళ, రేఖ, హేమలత పాల్గొన్నారు.

## వర్గీకరణ చేయకుంటే బీజేపీని బొందపెడతాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్



ర్యాలీలో పాల్గొన్న పలు పార్టీల నాయకులు

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీని రాష్ట్రంలో రాజకీయంగా బొందపెడతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ హెచ్చరించారు. మంద కృష్ణ పిలుపు మేరకు చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర 19వ రోజు శుక్రవారం జనగామకు చేరుకుంది. రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి కేంద్రంలో సంపూర్ణ మెజార్టీ ఉన్నా వర్గీకరణ చేయకుండా నమ్మకద్రోహం చేస్తోందని అన్నారు. ఇందుకు నిరసనగా ఏప్రిల్ 4న హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధించబోతున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, డాక్టర్ రాజమౌళి, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు స్వామి నాయక్ తదితరులు సంఘీభావం ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 107మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్‌మీడియట్ పరీక్షలకు 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఓ బైరి శ్రీనివాస్ తెలిపారు. జనరల్ విభాగంలో 2,587 మందికి 2,558, ఒకేషనల్ విభాగంలో 1,142 మందికి 1,064 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.


**అవినీతి నుంచి అభివృద్ధిలోకి..**

**సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి**

**గుణాత్మక సమాచారం సేకరించాలి**

- వివరాలు 10లో▸


# 'క్షయ' నిర్మూలనకు కృషి చేయాలి

- సమీక్షలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

జనగామ: జిల్లాలో క్షయ(టీబీ) వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షయ ప్రాణాంతక వ్యాధి కాదని, చికిత్స, బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కావచ్చన్నారు. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 578 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతినెలా వారికి పౌష్టికాహారం కోసం(చికిత్స కాలం మొత్తం) రూ.500 అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని వివరించారు. అంతకు ముందు జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు నిర్వహించి న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణ చర్యలపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.మహేందర్, డాక్టర్ భాస్కర్, టీబీ ప్రోగ్రాం నియంత్రణ అధికారి డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- జిల్లాలో 200 సెంటర్ల ఏర్పాటు
- సమీక్షలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జనగామ: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. జిల్లాలో 200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఐకేపీ 111, పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన 89 సెంటర్లు ఉంటాయన్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో ప్రస్తుతం 25 నుంచి 30 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు మరిన్ని సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో వసతి సౌకర్యాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు తదితర వాటిని ఏర్పాటు చేయాలన్నారు. యాసంగిలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమీక్షలో డీఆర్డీఓ రాంరెడ్డి, డీసీఓ కిరణ్‌కుమార్, డీసీఎస్‌ఓ ఎం.రోజారాణి, డీఎం మార్కెటింగ్ నాగేశ్వరశర్మ, డీఎం సివిల్‌సప్లయ్ సంధ్యారాణి పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

జనగామ రూరల్: రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్‌లో తెలంగాణకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాతూరి ప్రశాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన సమయంలో ఇచ్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం వంటి హామీలు తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ అమలు కాకపోవడం తెలంగాణపై కక్షసాధింపు చర్య అని పేర్కొన్నారు. వాటిని బీజేపీ పాలిత రాష్ట్రాలకు తరలించి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. హామీల అమలుకు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఏప్రిల్ 5 వరకు ప్రజా పోరుయాత్ర ఉమ్మడి వరంగల్ నుంచి నిర్వహిస్తున్నామని, 3వ తేదీన జనగామలో బహిరంగ సభ ఉంటుందని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి సుగుణమ్మ, మంగళంపల్లి జనార్దన్, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, రాములు, జువారి రమేష్, మల్లేషం, ఎల్లయ్య, కుమారస్వామి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు, పెన్షన్ ఒకటో తేదీనే ఇవ్వాలి

- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

జనగామ: ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులతోపాటు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు, పెన్షన్ చెల్లించాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు పి.చంద్రశేఖర్‌రావు, బి.లక్ష్మయ్య, ఇప్ప రాంరెడ్డి, సీహెచ్.రవి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ట్రెజరీ(కలెక్టర్) కార్యాలయం ఎదుట శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధనిక రాష్ట్రమని దేశమంతా చెప్పుకుంటూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు నెల మొదటి రోజు జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఎయిడెడ్ టీచర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదని, సరెండర్ సెలవు వేతనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిలు, జీపీఎఫ్, జీఎల్ఐఎస్ చెల్లింపులు నెలల తరబడి పెండింగులో ఉన్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ప్రతి బిల్లు చెల్లించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, జి.కళావతి, ఆకుల శ్రీనివాస్‌రావు, నాగుల రాజు, బి.చొక్కయ్య, వెంకటేష్, శ్రీహరి, ఎండీ.షరీఫ్, వజ్రయ్య, ఎం.యాదయ్య, వెంకన్న, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ ద్రోహులకు పెద్దపీట

- ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



యాత్రలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: రాష్ట్ర సాధన ఉద్యమంలో కష్టపడి పని చేసిన వారిని పక్కన బెట్టిన కేసీఆర్ ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్వరాష్ట్ర పోరాటంలో జనగామ, చేర్యాల ప్రాంతాలు ముఖ్యభూమిక పోషించాయని పేర్కొన్నారు. 'హాథ్ సే హాథ్ జోడో'లో భాగంగా జనగామ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన యాత్రను 'కొమ్మూరి'.. ఆర్టీసీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఏరియా నుంచి అంబేడ్కర్‌నగర్, సంజయ్‌నగర్, ధర్మకంచ, అమ్మబావి, రైల్వేస్టేషన్, నెహ్రూపార్క్ మీదుగా సాగిన యాత్రంలో కొమ్మూరి ప్రజలను కలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కాలంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జనగామ నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా భూకబ్జాలతో నిత్యం వార్తల్లో ఉంటున్నారని ఆరోపించారు. ప్రజల అవసరాలు తీర్చే విధంగా పని చేయాలని, వారు తరిమికొట్టే వరకు చూడొద్దని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద పిల్లలందరికీ ఉచిత కార్పొరేట్ విద్య అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీని గద్దె దింపేందుకు ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ, ఇతర పార్టీల నుంచి పలువురు కౌన్సిలర్ గాదెపాక రామచందర్, బిల్‌బుల్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు చారబుడ్ల రాందయాకర్ రెడ్డి, కౌన్సిలర్లు వంగాల కళ్యాణిమల్లారెడ్డి, ముస్త్యాల రాంచందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచ రాములు, బొట్ల నర్సింగరావు, ఆలేటి సిద్ధిరాములు, జాయ మల్లేశం, మోటె శ్రీనివాస్, ప్రవీణ్, కోటా నాయక్, లక్ష్మయ్య, స్వామి, నర్సింహులు, గాదె మోహన్‌రెడ్డి, గంగం నర్సింహారెడి, అల్లం ప్రదీప్‌రెడ్డి, కొమ్ము నర్సింగరావు, సర్పంచ్‌లు సుంకరి నిర్మలశ్రీనివాస్‌రెడ్డి, శ్రీలతశ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీలు నల్లగొని బాలకిషన్, మసూద్, జ్యోతి భాస్కర్, అమృతరెడ్డి, దిడిగె రమేష్, హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుడుంబా తయారు చేయొద్దు


సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

ఖానాపురం: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ అన్నారు. మండలంలోని నాజీతండా శివారు అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 900 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ సదానందం, జగదీశ్, సంతోశ్, స్వర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### బాలుడితో ప్రేమ.. యువతి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: బాలుడితో ప్రేమ వ్యవహారం కారణంగా.. మహబూబాబాద్ జిల్లాలో ఓ యువతి పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. 26 ఏళ్ల యువతి, 17 ఏళ్ల బాలుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈవిషయమై కొద్దిరోజులుగా రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈక్రమంలో యువతి శుక్రవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈఘటనపై పోలీసులను వివరణ కోరగా.. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### కుక్కల దాడిలో మహిళకు గాయాలు



వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన భూక్యా వినోదకు గాయాలయ్యాయి. వినోద శుక్రవారం వ్యవసాయ పనుల కోసం బయటకు రాగా.. వీధి కుక్కలు దాడి చేశాయి. వెంటనే ఆమెను వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతోంది.



# 'గజ్జల' గ్రంథాలయం.. ప్రకృతి పరవశం!


రామేశ్వరం ఏర్పాటు చేసిన నేచురోపతి లైబ్రరీ

- అరుదైన పుస్తకాలు సేకరించి నేచురోపతి లైబ్రరీ ఏర్పాటు
- ప్రజా బాహుళ్యంలోకి ప్రకృతి వైద్య విజ్ఞాన సంపద
- పుస్తకాల ప్రదర్శనలు, పరిశోధనలు
- 29న రిటైర్డ్ ఆచార్యులు 'గజ్జల'కు కీర్తి పురస్కారం

విశ్వానికి సంబంధించిన అనంతమైన నిధి అక్కడ దాగుంది. ప్రకృతి అక్షరాల రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆధునిక వైద్యానికి సైతం అందని ఎన్నో రుగ్మతలకు పరిష్కారం అక్కడ దొరుకుతుంది. ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్ల శ్రమించి నిర్మించిన కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం కృషిపై 'సాక్షి' ప్రత్యేకం.

**- కేయూ క్యాంపస్**

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యులు గజ్జల రామేశ్వరం. ఆయన అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను సేకరించారు. మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్యంపై ఉన్న మక్కువతో దేశమంతా తిరిగి అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాలు, జర్నల్స్‌ను సేకరించారు. ప్రకృతి వైద్య సాహిత్య ప్రదర్శనలిచ్చి ప్రజా బాహుళ్యంలోకి వెళ్లేలా కృషి చేశారు. హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని బ్యాంకుకాలనీలో తన సొంత భవనంలో జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య గ్రంథాలయాన్ని 2018 జులై 24న ఏర్పాటు చేశారు. ఆతర్వాత దాన్ని 2021 జులై 24న అంతర్జాతీయ ప్రకృతి వైద్య విజ్ఞాన సంపదతో అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీగా మార్చారు. గ్రంథాలయంలో ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ, మరాఠీ, ఉర్దూ, గుజరాతి కన్నడ తదితర భాషల్లో ఆయా ప్రకృతి వైద్య సాహిత్యం అందుబాటులో ఉంది. ఎవరైనా ఇక్కడికి వచ్చి అందులోని ప్రకృతి వైద్య సాహిత్యాన్ని, జర్నల్స్‌ను చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఉచిత ప్రవేశం, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అక్కడే రెండ్రోజులు ఉండేలా వసతి కూడా కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠకులు వచ్చి చదువుకోవచ్చు. సుమారు వందేళ్ల కిందటి నేచురోపతికి సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్, మాసపత్రికలు ఇక్కడి లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.


జీఈడీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

**సదస్సులు.. రికార్డులు..**

అరుదైన ప్రకృతి వైద్య సాహిత్యం సేకరించిన ఆచార్య రామేశ్వరంనకు 2016లో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 1990లో ముంబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో రామేశ్వరం పాల్గొని పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తెలుగులో ప్రకృతి వైద్య నిఘంటువు ఆయన రూపొందించారు. ప్రకృతి వైద్య విజ్ఞాన గ్రంథాల వివరాలను బిబ్లియోగ్రఫీ పుస్తకం రూపంలో తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. మహాత్మాగాంధీ అండ్ నేచురోపతి 50 సంవత్సరాల గవర్నమెంట్ అండ్ పాలిసీస్ అండ్ ప్రోగ్రామ్స్ అంశంపై న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో రామేశ్వరం సమర్పించిన పరిశోధన పత్రానికిగాను సంబంధిత అధికారుల చేతుల మీదుగా బ్రాంజ్‌మెడల్‌ను అందుకున్నారు. గతేడాది డిసెంబర్ 25న హైదరాబాద్‌లో నిర్వహించిన వాజ్‌పేయి జయంతిలో గజ్జల రామేశ్వరంనకు వాజ్‌పేయ్ ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారం అందజేశారు.

**మ్యూజియంలో పుస్తకాలు**

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ హెరిటేజ్ మ్యూజియంలో రామేశ్వరం సేకరించిన అరుదైన పలు పుస్తకాలను కూడా అందులో ఉంచాలని ఆసంస్థ కోరి కొంత స్థలాన్ని కేటాయించడంతో ఆయన అక్కడి మ్యూజియంలో కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

**కీర్తి పురస్కారం**

వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరంను ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ప్రకటించారు. ప్రకృతి వైద్య సాహిత్య సేకరణ, లైబ్రరీ ఏర్పాటు, ప్రకృతి వైద్యంలో పరిశోధనలకు గాను ఆ యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందించనుంది. ఈనెల 29న రామేశ్వరం ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

**విశ్వవ్యాప్తం చేయాలనే తపన**



మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్య విధానాన్ని ప్రజా బాహుళ్యంలోకి విశ్వవ్యాప్తం చేయాలనేది నా తపన. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సేకరించిన అరుదైన పుస్తకాలు, జర్నల్స్‌తో లైబ్రరీని ఏర్పాటు చేశాను. కీర్తి పురస్కారం లభించడం సంతోషంగా ఉంది. గ్రంథాలయం ప్రకృతి వైద్య పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందరూ వినియోగించుకోవాలి.

**- గజ్జల రామేశ్వరం, రిటైర్డ్ ఆచార్యులు**

### వరకట్న వేధింపులకు వివాహిత బలి

- మృతురాలు నాలుగు నెలల గర్భవతి


మృతి చెందిన సాయిప్రత్యూష

మరిపెడ రూరల్: అత్తింటి కట్నం వేధింపులకు ఓ వివాహిత బలైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధి జామ్లా తండాకు చెందిన సాయి ప్రత్యూష(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జామ్లా తండాకు చెందిన బానోతు మహేశ్‌కు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన సాయిప్రత్యూష ప్రేమించి మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో కట్న కానుకల కింద బంగారం, సుమారు రూ.లక్ష ఇచ్చారు. వీరికి 18 నెలల పాప ఉంది. మహేశ్ వ్యవసాయ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలి కాలంలో అదనపు కట్నం కోసం భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు తండా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ గొడవలు సర్దుమణగలేదు. దీంతో భర్తతో పాటు అత్త, మామ వేధింపులు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో మరోసారి ఇంట్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గురువారం రాత్రి సాయి ప్రత్యూష ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రస్తుతం సాయిప్రత్యూష నాలుగు నెలల గర్భవతిగా అక్కడి వైద్యులు గుర్తించినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి దరావత్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామ రూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేల మందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని, రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు, వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, వివిధ జిల్లాల నుంచి అధికారులు, రైతులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంట్రల్ బోర్డు సభ్యురాలు భాగ్య, అధికారులు

# కూచిపూడి గురువు పద్మజ కన్నుమూత


కుప్పా పద్మజ (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కుప్పా పద్మజ (56) గుండెపోటుతో ఓ సిటిలోని ఆమె స్వగృహంలో గురువారం రాత్రి కన్నుమూశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పద్మజ గురువారం సాయంత్రం 7 గంటల వరకు విధుల్లో ఉన్నారు. ఆమె మరణ వార్త వినగానే సంగీత కళాశాల సిబ్బంది, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సంగీత, నృత్యకళాకారులు, శిష్యబృందం, గురువులు, ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. పద్మజ ఐదేళ్ల వయస్సు నుంచి నాట్యం నేర్చుకున్నారు. వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం నిర్వాహకురాలు వెంపటి నాగేశ్వరి వద్ద నృత్యం నేర్చుకున్నారు. 1992లో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా చేరారు. 2014 నుంచి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. న్యూఢిల్లీ దూరదర్శన్ కేంద్రం నుండి 'ఏ' గ్రేడ్ కూచిపూడి నాట్య కళాకారిణిగా గుర్తింపు పొందారు. మానవ వనరుల అభివృద్ధి శాఖచే జూనియర్ ఫెలోషిప్, తెలంగాణ ప్రభుత్వంచే ఉత్తమ నాట్యకారిణిగా అవార్డు 2015లో అందుకున్నారు. మరెన్నో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. నృత్యనాటికలకు దర్శకత్వం వహించారు. వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో 500లకు పైగా నృత్య ప్రదర్శనలిచ్చారు.

**ప్రముఖుల సంతాపం**

పద్మజ మరణం తీరని లోటు అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జానపద, గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ.. కుప్పా పద్మజ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లుగా నృత్యంలో పీహెచ్‌డీ సీటు కోసం ప్రయత్నించారని, పీహెచ్‌డీ చేయాలనే చిరకాల కోరిక తీరకుండానే వెళ్లిపోయారని గుర్తు చేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అధ్యాపకులు ఏడిద భీంశంకర్, జక్కోజు సత్యనారాయణ, భాస్కర్‌రావు, అనుమూల యోష, సీనియర్ అసిస్టెంట్ గడ్డం శంకర్, పేరిణి నృత్యగురువులు గజ్జెల రంజిత్‌కుమార్, నవ్యజ, ఓరుగల్లు శారద నాట్య మండలి సభ్యులు జేఎస్ శర్మ, జూలూరి నాగరాజు, వివిధ నృత్య కళా క్షేత్రాల గురువులు సంతాపం తెలిపారు.

## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**HOUSE FOR SALE**

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26841]

■GWMC అప్రూవ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు, 4 BHK డూప్లెక్స్ హౌజ్, 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్స్ ప్రారంభమైనవి. సంప్ర: శ్రీనివాస్ 8978638094, 9949732488 [W-775800]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26848]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26847]

■హన్మకొండ నయీంనగర్‌లో H.No: 2-2-189/1 120 చ॥గ॥లలో గల House అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సెల్: 9030382583. [W-775799]

**విల్లా ప్లాట్లు, హౌజెస్ బుకింగ్ ప్రారంభం**

■GWMC అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు (హన్మకొండ) లో విల్లా ప్లాట్లు 4 BHK డూప్లెక్స్ హౌజెస్ 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. సంప్ర: సోమేశ్వర్ - 8317534874 [W-785501]

**FLATS FOR SALE**

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26840]

■HYDERABAD, KUKATPALLY Behind Metro Shopping Mall, Main Road. Maitri Nagar, GHMC Approved. 3BHK Flats. Ready to Occupy. Limited Flats with all amenities. Ph: 9347566287. [HA-1069]

**LAND FOR SALE**

■1 Acre Land Elkathurthy KUDA Ideal For Farm House 500 Meters to KNR Highway. Bore Water. Ph: 9100910097. [H-793653]

■For Sale 163 Acres Single - Bit prime Land, Clear Title, Road-facing. Close to Vijayawada - Nagpur Expressway, Excellent Environment for Living, Business and agriculture, High iron soil. Nawabpet (V), Chityala (M), Bhupalpally(D). Cont: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26365]

**PLOT FOR SALE**

■మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600. [W-775798]

**SERVICES**

■పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతితక్కువ వడ్డీకి వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1784]

**బ్యూటీ పార్లర్**

■ మా శైలి బ్యూటీపార్లర్‌లో బ్యూటీషియన్ కోర్సు Free గా నేర్పించి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్ ఇవ్వబడును. మ్యారేజ్ Makeup, మెహిందీ చేయబడును. సంప్ర: 9989060668 [W-785462]

**PASSPORT MISSING**

■నేను అనగా వెలిశోజు చిన్మయాచారి, S/o. వెలిశోజు ఓంకారాచారి, గ్రా॥ ఎల్లాపూర్, హసన్‌పర్తి, హన్మకొండ. నాయొక్క పాస్‌పోర్ట్ బుధవారం రోజున ఎల్లాపూర్ నుండి హసన్‌పర్తి వచ్చు మార్గంలో మిస్ అయినది. కావున దయచేసి ఎవరికైనా దొరికినచో + 91-9618473170 నెంబర్‌కు కాల్ చేయగలరు. లేదా మీకు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగలరు. [W-785464]

**BUSINESS OFFER**

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టుల కొరకు LAP & Agents కావలెను, మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

**WANTED**

■ Wanted Receptionist Urgent. Male/ Female. Q: Any Degree. Good Communication in English must. Mandiwala Restaurant, Nakkalagutta, Hanamkonda. Cell: 9848092503. [WA-5284]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795262]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సెల్: 9573633520, 9059633520. [M-1190652]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325. [G-795265]

■ ప్రముఖ సంస్థలో పార్ట్ / ఫుల్ టైమ్ పనిచేయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ : 80084 01243 [V- 5664]

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, తోటపని మొదలగు పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్: 9246969042, 9848175211 [V-1788]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం, జీ: 18K ఎజెంట్ కమీషన్ 6K. ఫోన్: 7569955551, 9848571888. [H-793404]

■ TATA 709 రికవరీ వెహికల్ నడుపుటకు హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. కిషోర్ రెడ్డి సంప్ర: 9985400280, 6281523176. [HA-10387]

■ స్టార్ హోంకేర్ HYDలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్, ఇంటి / వంట పనికి స్త్రీ/పు, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 16,000/-, రూం + భోజనం ఫ్రీ. 78010 99881, 86398 28228 [V-775179]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


గోపాలస్వామి(ఫైల్)

లింగాలఘణపురం: రోడ్డు ప్రమాదంలో మండలంలోని నెల్లుట్లకు చెందిన ఉపాధ్యాయుడు సంబోజు గోపాలస్వామి(56) శుక్రవారం మృతి చెందాడు. గోపాలస్వామి జనగామలో ఉంటూ.. మండలంలోని కిష్టగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ద్విచక్రవాహనంపై కిష్టగూడెం పాఠశాలకు బయల్దేరాడు. నెల్లుట్ల వద్ద బ్రిడ్జి దిగుతుండగా.. కుక్క ఎదురుగా రావడంతో ఒక్కసారిగా ముందు బ్రేక్ సడన్‌గా వేయడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. హెల్మెట్ ఉన్నప్పటికీ తలకు, కడుపులో బలమైన గాయాలు కావడంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతిపై మండలంలోని ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఈఓ చంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

### దాచుకున్న డబ్బులు దోచుకున్నారు..

నల్లబెల్లి: గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను ఇంట్లో దాచుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు దోచుకున్నారు. మండలంలోని రుద్రగూడెం గొల్లవాడకు చెందిన మేరుగు శ్రీకాంత్ ఇటీవల తనకున్న గొర్రెలను విక్రయించాడు. జీవనోపాధి కోసం టవేరా వాహనాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను వాహనం అప్పు తీర్చాలనుకున్నాడు. గొర్రెలను కొన్న వ్యక్తి శుక్రవారం శ్రీకాంత్ వద్దకు వచ్చి నగదు ఇవ్వడంతో ఇంట్లో దాచిపెట్టాడు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి రాగా.. తలుపులు తీసి ఉండడంతో అనుమానంతో ఇంట్లో డబ్బులను చూడగా.. రూ.50 వేలు, తులంన్నర బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందించగా.. క్లూస్ టీం బాధితుడి ఇంటికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

### ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


శ్రీధర్(ఫైల్)

ఐనవోలు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు కాసుగొండ శ్రీధర్(34) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం గమనించిన శ్రీధర్ భార్య లక్ష్మి అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతున్న అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జఫర్‌గఢ్ ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

### ఆహార ధాన్యాల కృత్రిమ కొరత సృష్టించొద్దు

- హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: ఆహార ధాన్యాలను అక్రమంగా నిల్వచేస్తూ కృత్రిమ కొరత సృష్టించవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధరల నియంత్రణపై సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత నెలకు, ప్రసుత్త నెలకు వస్తువుల డిమాండ్ పెరుగుదల పరిశీలించాలన్నారు. డిమాండ్ ఉన్న వస్తువులు క్రమంగా నిల్వచేసి ధరలు పెంచే విధంగా వ్యాపారస్తులు చేయవద్దని ఆదేశించారు. అలాంటి వారిపై అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్ఓ వసంతలక్ష్మి, డీఎస్పీ రాజు, డీఎంసీఎస్ మహేందర్, తూనికలు కొలతలు అధికారి అనిల్‌కుమార్, వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతు బజార్ అధికారి షఫియుద్దీన్, డీటీసీఎస్‌లు కృష్ణ, సత్యనారాయణ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు,

# కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా


అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్లతో వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున తక్షణ సాయంగా ప్రకటించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎస్) జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట వివిధ రైతు సంఘాల నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. ముఖ్యమంత్రి గురువారం ఎకరానికి రూ.10వేల చొప్పున ఇస్తామని ప్రకటించారని, అయితే రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. సీఎం ప్రకటించిన రూ.10వేలు ఎందుకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. రైతుల పంటలకు బీమా చేయించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్ మాట్లాడుతూ రుణమాఫీ పథకం అనేది రాష్ట్రంలో ప్రహసనంగా మారిందన్నారు. ధర్నాలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరగోని శంకరయ్య, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, సంయుక్త కిసాన్ మహాసభ జిల్లా అధ్యక్షుడు వల్లందాసు కుమార్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, రాజేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సున్నా అప్పారావు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# గడపగడపకూ బీజేపీని తీసుకెళ్లాలి

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శుక్రవారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ గ్రామానికి ఓబీసీ... గడపగడపకూ బీజేపీలో మోదీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూడా బీసీ సారథ్యంలోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓబీసీలు బీజేపీకి అండగా నిలువాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు బెజ్జంకి పూర్ణాచారి, గాజుల సంపత్, నాయకులు బాసాని సోమరాజు, గడప శివ, నర్మెట్ట శ్రీనివాస్, సంతోష్, గీల సురేష్, నాగవెల్లి గోపి, నవీన్, తిలక్, బండి సదానందం పాల్గొన్నారు.

### ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న జరగనున్నాయి. శుక్రవారం అంబేద్కర్ హాల్‌లో మధ్యాహ్నం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గడువు ముగిసింది. శనివారం అభ్యర్థుల ఉప సంహరణ కార్యక్రమం ముగియడంతో సాయంత్రం పోటీల్లో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. ఏకగ్రీవంగా కిరణ్‌సింగ్, విష్ణుకుమార్‌గుప్తా, పద్మలత గౌడ్ నియమితులు కాగా.. నామినేషన్ వేసిన వారిలో ప్రెసిడెంట్‌గా యం.రమేశ్‌బాబు, పి.సత్యనారాయణ, వై.శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా డి.దయానశ్రీనివాసన్, ఎన్.నరేందర్ తదితరులున్నారు.